# భారత నేర విచారణా చట్ట సవరణ

**బ్రిటిష్** వలసవాద పాలకులు రూపొందించిన బ్రిటిష్–ఇండియా చట్టంలోని అనేక విభాగాలను జొప్పించి 1947 తదనంతరం భారత నేరస్మృతిని రూపొందించారు. గత కాలపు నేరపూరిత వలసవాద పాలకులపై ఆరోపణలు చేస్తూ, ఈ నూతన చట్టాన్ని ముందుకు తెచ్చారు. ప్రస్తుత పాలకుల పూర్వీకుడైన సావర్కార్, బ్రిటిష్ వలసవాద పాలనకు మద్దతుగా వుండి, 'సంఘపరివారపు' శక్తిని బలహీనపరచకుండా వుండేందుకు మాత్రమే వారితో పోరాటం చేశాడు; అరెస్ట్ అయిన సమయంలో బ్రిటిష్ పాలకులకు క్షమాపణలు చెప్పి, 'వారు తనను క్షమించి, జైలు నుండి విడుదల జేస్తే' తన మిగిలిన జీవితకాలమంతా బ్రిటిష్ వలసవాదానికి సేవజేస్తానని చెప్పాడు. ఆయన వారసులే ఈనాడు అధికారంలోనున్నారు. వారి 'దేశభక్తి'గా పేర్కొనబడేది ఈనాటికి ప్రజ్వరిల్లి, మన చట్టాలపై వలసవాద ప్రభావం వుందని 'అర్థం చేసుకున్నారు'!

76 సంవత్సరాల స్వతంత్రం తర్వాత, భారత నేరచట్టంపై వలసవాద ప్రభావాన్ని తొలగించటం అవసరమని ప్రభుత్వం గుర్తించిన కారణంగా నూతన చట్టాన్ని ప్రవేశపెట్టినట్లు చెబుతున్నారు. ఇది ఇలా వుండగా, ప్రస్తుతం వునికిలోవున్న చట్టంలో ఏ లోపముందనే అంశాన్ని ప్రభుత్వం పేర్కొనటం లేదు. కేవలం భారత నేర చట్టాన్ని సంస్కరించటంతో భారత న్యాయవ్యవస్థపై వలసవాద ప్రభావాన్ని తప్పించగలమా? భారత ప్రభుత్వ చట్టాల నుండి, బాలల పరిరక్షణ చట్టం వరకు బ్రిటిష్ ప్రభుత్వం రూపొందించిన చట్టాలనే భారతదేశం ఈనాటికీ అనుసరిస్తోంది. పారిశ్రామిక వివాదాల చట్టం, భారత రైల్వేల చట్టం, భారత రక్షణ బలగాల చట్టం, భారత రక్షణ చట్టం, భారత టెలికాం చట్టం, హిందూ వారసత్వ చట్టం... మొదలగు దేశంలోని వివిధ విభాగాల చట్టాలను బ్రిటిష్ ప్రభుత్వమే ముందుకు తెచ్చింది. వాటన్నింటినీ ఈనాటికీ భారతదేశ రాజ్యవ్యవస్థే అదుపు చేస్తోంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూడా నిస్సిగ్గుగా ఈ చట్టాలను అనుసరించటాన్ని కొనసాగిస్తూనే, గత వలస కాలంనాటి చట్టాల పేర్లను మారుస్తూ, మరిన్ని క్రూరమైన మార్పులు చేస్తూ వీటినే అనుసరిస్తోంది. ప్రభుత్వ మోసకారీతనాన్ని గుర్తించేందుకు, ఈ చట్టాన్ని లోతుల్లోకి వెళ్ళి విశ్లేషించటం అవసరం.

భారత న్యాయవ్యవస్థ అనుసరిస్తూ వస్తోన్న భారత శిక్షాస్మృతి (ఐపిసి), భారత సాక్ష్యాధార చట్టం, భారత నేరవిచారణా చట్టం (సిఆర్‌పిసి)... వీటన్నింటినీ రద్దుచేసి, నూతనంగా, 'భారతీయం'గా రూపొందించి, న్యాయవ్యవస్థలో పునఃస్థాపించారు. దాదాపు 140 కోట్ల దేశ ప్రజానీకపు రోజువారీ జీవనాన్ని ప్రభావితం చేసే ఈ చట్టాల్ని పూర్తి అప్రజాస్వామిక పద్ధతిలో ముందుకు తెచ్చారు! ఏ దేశ నేర న్యాయవ్యవస్థ అయినా, ఆ దేశ పౌరులకు అది గంభీర విషయమే. నేర న్యాయ చట్టంలో ఏ మార్పునైనా చేసేందుకు, ఎన్నికైన సభాప్రతినిధుల గంభీర చర్చకు, విశ్లేషణకు గురికావాలి.

93 మంది ప్రతిపక్ష ఎం.పీ.లను సభ నుండి తాత్కాలికంగా తొలగించిన (సస్పెండ్ చేసిన) సందర్భంలో ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, చట్టంగా ముందుకు తెచ్చారు. కనీసపాటి చర్చ కూడా లేకుండానే ప్రభుత్వం ఈ చట్టం చేసిందని దీని ద్వారా స్పష్టమే! 2024 ఫిబ్రవరి నుండి ఈ నూతన చట్టం అమలులోకి వచ్చింది. ప్రజాస్వామ్య వ్యతిరేక పద్ధతుల్లో ముందుకు తేబడిన ఈ చట్టం ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసుకునేందుకు, ఈ నూతన చట్టం అమలయ్యేంతదాకా మనం వేచి చూడాలి. ఈ చట్టంలోని అనేక విభాగాలు, ఈ చట్టాన్ని అమలుజేసే అధికారులు తమ సౌలభ్యాని కనుగుణంగా వ్యాఖ్యానించేందుకు అవకాశమిస్తున్నాయి.

1860 నాటి భారత శిక్షా స్మృతి (ఐపిసి) స్థానంలో 'భారతీయ న్యాయసంహిత' (బిఎన్ఎస్)ను ముందుకు తెచ్చారు.

1872 నాటి భారతీయ సాక్ష్యాల చట్టం స్థానంలో భారతీయ సాక్ష్య చట్టం(బిఎస్)ను, 1973 నాటి నేర విచారణ చట్టం (బిఎన్ఎస్ఎస్) లను ముందుకు తెచ్చారు.

అన్ని దేశాలు తమతమ న్యాయవ్యవస్థలలో మార్పులు, సవరణలు చేసుకుంటూ వుంటాయి. రాజరిక నియంతృత్వంలో రాజు మాటే చట్టం! మత పరచట్టాలు మతపరమైనవే. ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థను కూలద్రోసి ఇస్లామ్ మతావలంబకులు అధికారంలోకి వచ్చినపుడు, ఆయా దేశాలలో ఇస్లామ్ చట్టాలనే అమలు చేశారు. కొన్ని దేశాలలో తిరుగుబాట్లు, లేదా విప్లవకర ప్రభుత్వ మార్పు జరిగినపుడు, నేర విచారణ చట్టాలలో మార్పులు చేయటం చాలా సహజం. పరిస్థితులు కల్పించే అవసరమే, ఎల్లవేళలా చట్టాన్ని సృష్టిస్తుంది. పాలక ప్రభుత్వ సైద్ధాంతిక లక్ష్యాలను నెరవేర్చుకోవటంలో, ఉనికిలో వున్న చట్టం ఆటంకంగా వుంటే, ఆ చట్టాన్ని తొలగించి, అవసరమైన కొత్త విభాగాలను జోడించటం జరిగి తీరుతుంది. ప్రస్తుత పాలక ప్రభుత్వ సిద్ధాంతం – హిందూమతతత్వం. ఇండియాను 'భారత్'గాను, 'భారత్'ను హిందూ రాజ్యాంగానూ మలచటంలో ప్రస్తుతం ఉనికిలోవున్న చట్టంలో వివిధ సెక్షన్లు అడ్డంకులు సృష్టిస్తున్నాయని పాలకపార్టీ అభిప్రాయపడితే, ఆ సెక్షన్లను తొలగించటం, అవసరమైన విభాగాలను జోడించటం సహజమే. అయితే, ప్రజలకు వాస్తవం చెప్పే ధైర్యం పాలకపార్టీకి లేదు. భారతదేశం భారత స్వాతంత్ర్యోద్యమం ద్వారా అభివృద్ధి

చెందిన దృఢమైన ప్రజాస్వామ్య, లౌకికవాద పునాదిపై, దానిని రక్షించే ఒక రాజ్యాంగంపై ఆధారపడి వుంది.

న్యాయవ్యవస్థలోని వలసవాద లక్షణాలను రద్దుచేసి భారతీయీకరించటమన్నది వారి లక్ష్య సాధనకు తగిన నినాదంగా వుంది. లేకుంటే, ప్రస్తుత న్యాయవ్యవస్థలోని ఇబ్బందులు తప్పనిసరిగా ఎత్తిచూపవలసి వుంటుంది. అయితే, ప్రస్తుతం ఉనికిలోవున్న న్యాయవ్యవస్థలో లోటుపాట్లేమిటో ఎత్తిచూపటం జరగలేదు. ప్రస్తుతం వున్న చట్టాలకు కొన్ని చేర్పులను చేశారు; వాటిని మాత్రమే విస్తరించారు.

నూతన చేర్పులలో, నిరాహారదీక్షలు, ధర్నాలు కూడా నేరాలే. అలాగే, పోలీసులకు అమిత అధికారాలను ఇచ్చారు. మాటలోగానీ, రాతలోగానీ, వార్తలోగానీ లేదా చర్యలోగానీ రాజ్యానికి అంగీకారం కాని చర్య ఏదైనా నేరంగా పరిగణించ బడుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే, ఇది అసమ్మతుల, నిరసనల, అభ్యంతరాల నోరు మూయిస్తుంది.

భారత నేరచట్టాలను సంస్కరించాల్సి వుందనే దాంట్లో సందేహమేమీలేదు. అనేక చట్టాలకు కాలం చెల్లింది. కాలపరిమితి దాటిపోయిన సమస్యను అనేక చట్టాలలో ఎత్తి చూపారు. ఉదాహరణకు – ఆహార పదార్థాలలో కల్తీ నిరోధకానికి ఒక ప్రత్యేక చట్టం వుంది. అలాగే కాలుష్య నివారణకు కూడా. అయితే, పాత నేరచట్టాలలోని అవే అంశాలను నూతన నేర చట్టంలో ఎత్తిరాయటమే జరిగింది.

దీని ఫలితంగా ఒకే నేరానికి రెండు విధాలైన శిక్షలు వుండటానికి అవకాశముంది. బ్యాంకులను, ప్రభుత్వాన్ని మోసగించి భారతదేశం నుండి విదేశాలకు వెళ్ళిన వారిని భారత న్యాయవ్యవస్థ వెనక్కు తీసుకురాలేదు. వారి గైర్హాజరిలోనూ కేసులను చేపట్టి విచారించే ప్రయత్నం చేయవచ్చు. కానీ, నూతన చట్టంలో అలాంటి దానికి అవకాశమే లేదు.

ఇంతేగాక, భారతదేశంలోని నేర చట్టం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్య ఏమంటే, న్యాయస్థానాలలో నిలిచిపోతున్న కేసులు! 2020 సం॥లో విడుదలయిన న్యాయశాఖ సమాచారం ప్రకారం, 44.84 మిలియన్ల (4 కోట్ల 48 లక్షల 40 వేల) కేసులు భారత న్యాయస్థానాల్లో పెండింగ్‌లో వున్నాయి. వీనిలో అధికంగా అంటే 75 శాతం కేసులు క్రిమినల్ కేసులే. ఎంతమంది అమాయకులు ఈ కారణంగా జైళ్ళలోనే చంపబడుతున్నారో!? నూతన చట్టం, దీనికి ఎలాంటి పరిష్కారాన్నీ ప్రతిపాదించలేదు. 2022 నాటి నేర నమోదు బ్యూరో అంచనా ప్రకారం, 5,73,220 మంది భారత జైళ్ళలో మగ్గుతున్నారు. 1,33,415 మంది శిక్షలు విధించబడి జైళ్ళలో వున్నారు. దీని అర్థం 75 శాతం పైగా జైళ్ళలోని వారంతా విచారణ ఖైదీలే. ఖైదీలు తప్పుచేసి వుంటే, వారిని శిక్షించవచ్చు. అయితే, విచారణ ఖైదీలుగా సంవత్సరాల తరబడి వారిని జైళ్ళలో నిర్బంధించటం ప్రజాస్వామ్య వ్యతిరేకం, మానవ హక్కుల ఉల్లంఘన కూడా. నేర చట్ట సంస్కరణ నుండి ఏమైతే వారు ఆశించారో. దానిని వారు పొందలేరు. క్లుప్తంలో, చట్ట సంస్కరణ, పాలక పార్టీ సిద్ధాంతాచరణకు మాత్రమే ప్రయోజనం చేకూరుస్తుంది.

**(2024 మార్చి 'క్లాస్ స్ట్రగుల్' నుండి అనువాదం)**

★★★★★